క్లుప్తంగా

పోలవరం ఎత్తు తగ్గింపుపై కేంద్రం కుట్ర

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్ల నుంచి 41.5 మీటర్లకు కుదించడం, నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా ఎగ్గొట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రెండు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన దీక్షలు సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అక్కినేని వనజ, డేగా ప్రభాకర్, చలసాని వెంకట రామారావు, కొమ్మన నాగేశ్వరరావు, మన్నవ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించినట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమీషనర్ లోక్‌నాథ్ సాహూ తెలిపారు. స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాల ఆడిటోరియంలో సోమవారం ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో నిధి ఆప్ కే నికట్ 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సాహూ పీఎఫ్ సభ్యులు, పెన్షనర్లు, యజమానులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పి వారి సందేహాలను నివృత్తి చేశారు. సీఆర్ఆర్ కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ విశ్వేశ్వరరావు, పీఎఫ్ సంస్థ నోడల్ అధికారి కేబీ మణిశంకర్, డీ. సత్తిరాజు పాల్గొన్నారు.

దాతృత్వానికి ప్రతీక రంజాన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముస్లింల అతి పవిత్ర మాసం రంజాన్ మాసం దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రముఖ పారిశ్రామికవేత్త అంబికా రాజా పేర్కొన్నారు. స్థానిక అమీనాపేట రిజర్వ్‌పోలీస్ లైన్ మజీదులో రంజాన్ ఉపవాస దీక్ష విరామం అనంతరం సోమవారం సాయంత్రం ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు ఎస్‌కే మస్తాన్ భాషా, మసీదు పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ఆయన ప్రారంభించారు.మసీదు కమిటీ చైర్మన్ ఎండీ రసూల్ అంజుమన్ సంస్థ సభ్యు లు ఎండీ అక్బర్, రియాజ్ అలీఖాన్ పాల్గొన్నారు.

చాటపర్రులో మట్టి తవ్వకాలు

ఏలూరు రూరల్: ఏలూరు మండలం చాటపర్రు గ్రామంలో మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. కొందరు రియల్టర్లు స్థానిక జనార్ధన స్వామి చెరువు నుంచి గుట్టు చప్పుడు కాకుండా మట్టి తరలిస్తున్నారు. ఈ మట్టితో గ్రామ పరిసరాల్లో సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో గల పంటభూమి మెరక చేస్తున్నారు. ఇటీవల భూయజమాని పంటభూమి లాండ్ కన్వర్షన్ చేపట్టినట్టు తెలిసింది. ఇప్పుడు భూమి మొత్తాన్ని మెరక చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. దీనిపై ఈఓపీఆర్డీ ఎం సరళకుమారిని వివరణ కోరగా తన దృష్టికి రాలేదని చెప్పారు.

ఏలూరుకు ‘ భారీ బడ్జెట్ ’

- రూ.237కోట్లతో బడ్జెట్ రూపకల్పన ?
- 2023-24ఆర్థిక ఏడాది ఖర్చులు రూ.227 కోట్లు
- 2023-24 బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.56.90కోట్లు
- 2023-24 బడ్జెట్ ముగింపు నిల్వ రూ.10.55కోట్లు ?
- ఈనెల 29న కార్పొరేషన్ సర్వసభ్య ప్రత్యేక సమావేశం



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం (ఫైల్‌ఫొటో)

2023-24 బడ్జెట్ ప్రారంభ నిల్వ - రూ.56.90కోట్లు
ఆయా పద్దుల్లో జమలు - రూ. 180.77కోట్లు
ప్రారంభ నిల్వతో కలిపి - రూ.237.67కోట్లు
ఆర్థిక ఏడాదిలో ఖర్చులు - రూ. 227.12కోట్లు
2023-24 ముగింపు నిల్వ - రూ. 10.55కోట్లు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ నూతన బడ్జెట్ భారీగా ఉండబోతుంది... గత ఐదేళ్లలో పోల్చితే ఏలూరు కార్పొరేషన్ ఆదాయం, ఖర్చులు, ప్రజలకు సేవలు భారీగా పెరగటంతో బడ్జెట్ అంచనాలు సైతం అదేస్థాయిలో పెరిగాయి. రెండు రోజుల్లో ఏలూరు కార్పొరేషన్ సర్వసభ్య ప్రత్యేక సమావేశంలో బడ్జెట్ ఆమోదానికి కౌన్సిల్ సభ్యులు సమావేశం కానున్నారు. ఏలూరు నగరం విస్తరించిన నేపథ్యంలో ఆదాయం సమకూర్చుకునేందుకు కౌన్సిల్ ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంటుంది. ఉద్యోగుల జీతాలకే భారీగా నిధుల వెచ్చించాల్సి వస్తోంది. ఇక అభివృద్ధి పనులు, నిర్వహణ, ప్రజారోగ్యం, విద్యుత్, నీటి సరఫరా, పట్టణ ప్రణాళిక, డిపాజిట్లు ఇలా ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు గానూ పెద్దెత్తున నిధులు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నెల 29న ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య ప్రత్యేక సమావేశంలో బడ్జెట్ ఆమోదానికి కౌన్సిల్ ముందు ఉంచేలా చర్యలు చేపట్టారు.

2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనా ? : ఏలూరు నగరపాలక సంస్థ తాజా అంచనా బడ్జెట్ భారీగా పెరిగింది. గతంలో కంటే పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయింపులు సైతం ఉన్నట్లు తెలుస్తోంది. 15 ఆర్థిక సంఘం నిధులు, 010 పద్దు జీతాల చెల్లింపులే రూ.100కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక నగరపాలక సంస్థ కౌన్సిల్ పూర్తిస్థాయిలో చర్చించి బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉంది.

ప్రధానంగా ఆర్థిక సంవత్సరంలో మంజూరు అయ్యే ఆయా గ్రాంట్లు ఇలా

ఏలూరు కార్పొరేషన్‌కు సంబంధించి ప్రజలకు, ఉద్యోగులకు, కార్మికులకు మెరుగైన సేవలు అందించేందుకు పాలకవర్గం కృషి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నగరపాలక సంస్థకు ఆయా గ్రాంట్లు రూపంలో నిధులను సమకూర్చనుంది. ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం నిధులు, 010 పద్దు జీతాలు నిధులు అగ్రబాగం అవుతున్నాయి. ఈ లెక్కన ఆయా గ్రాంట్లుగా సుమారుగా రూ.111.86కోట్లు మంజూరయ్యే అకాశాలు ఉన్నాయని అధికారులు అంచనాలు సిద్ధం చేశారు.

అర్బన్ హెల్త్ సెంటర్ గ్రాంటు	- రూ.4.50కోట్లు
ఏసీడీపీ గ్రాంటు	- రూ.2.కోట్లు
15 ఆర్థిక సంఘం నిధులు	- రూ.30కోట్లు
స్వచ్ఛ బారత్	- రూ.30లక్షలు
కిచెన్ షెడ్స్ నిర్మాణానికి	- రూ.20లక్షలు
ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ గ్రాంట్	- రూ.1.కోట్లు
అమృత్ నిధులు	- రూ.50లక్షలు
010 ట్రెజరీ జీతాలు	- రూ.70కోట్లు
ఎన్‌సీఏపీ	- రూ.3 కోట్లు
ఇతర నిధులు	- రూ.36లక్షలు

2023-24 ఆర్థిక సంవత్సరంలో కీలకమైన ఖర్చులు ఇలా

ఏలూరు నగరపాలక సంస్థకు సంబంధించి రూపొందించిన బడ్జెట్ అంచనాలు ఇలా ఉన్నాయి. ప్రజారోగ్యానికి, విద్యుత్, తాగునీరు, విద్య, ఇతర వాటికి భారీగా నిధులు ఖర్చు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ అంచనాల్లో సుమారుగా రూ.227కోట్లు ఖర్చు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ప్రారంభ నిల్వ సుమారుగా రూ.10కోట్లు వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నారు.

సాధారణ పరిపాలన	- రూ.7.53కోట్లు
ఇంజనీరింగ్ విబాగానికి	- రూ.24.63కోట్లు
ప్రజారోగ్యానికి సంబంధించి	- రూ.26.64కోట్లు
నగరంలో లైటింగ్‌కు	- రూ.14.90కోట్లు
విద్య అవసరాలకు	- రూ.3.48కోట్లు
తాగునీటి సరఫరా, డ్రైనేజీ	- రూ.19.81కోట్లు
పట్టణ ప్రణాళిక	- రూ.3.11కోట్లు
డిపాజిట్లు, అడ్వాన్సులు	- రూ. 10.83కోట్లు
లాభదాయక పథకాలు	- రూ. 4.31కోట్లు
గ్రాంట్లు, రుణాలు	- రూ.111.86కోట్లు

యువతకు దిక్సూచి సెంటర్ ఫర్ ఎక్సలెన్స్



సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జేడీ లక్ష్మీనారాయణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కళాశాల చదువుల చట్రంలో చిక్కి తమలో నిబిడీకృతమైన కళా సాంస్కృతిక నైపుణ్యాలను నిర్లక్ష్యం చేస్తున్న విద్యార్థులకు, యువతకు ప్రేమాలయం వృద్ధాశ్రమం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఓ దిక్సూచి కాగలదని సీబీఐ రిటైర్డ్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్‌ను సోమవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు అందించే దిశగా యువత నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ గురూజీ, సీఆర్ఆర్ విద్యా సంస్థల ప్రతినిధులు మాగంటి ప్రసాద్, వీవీ బాలకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, మాజీ మంత్రి మరడాని రంగారావు, డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య, ప్రేమాలం గౌరవ అధ్యక్షుడు టీవీ సుబ్బారావు, కార్యదర్శి ఎంఎస్‌వీ మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీ ఆలపాటి నాగేశ్వర రావు, వ్యక్తిత్వ వికాస నిపుణులు గంగాధర్ రెడ్డి, సీఆర్ఆర్ మహిళా కళాశాల ప్రిన్స్‌పాల్ పీ. శైలజ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విష జ్వరాలను అరికట్టాలి

ఏలూరు (టూటౌన్): జిల్లా ప్రజలను వణికిస్తున్న విషజ్వరాలను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో వేలకొలది విష జ్వరాల బాధితులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. ప్రత్యేకించి ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు మరింత ప్రజల్ని పట్టి పీడిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, వైద్యశాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రజలను కాపాడాలని ఆయన కోరారు.

న్యాయవాదుల గుమాస్తాల సంఘం అధ్యక్షునిగా రాము



నల్లా రాముని అభినందిస్తున్న సంఘ సభ్యులు, న్యాయవాదులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు న్యాయవాదుల గుమాస్తాల సంక్షేమ అధ్యక్షునిగా నల్లా రాము ఎన్నికయ్యారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని సంఘ కార్యాలయం నందు సోమవారం జరిగిన ఎన్నికల్లో ఆయన తన సమీప ప్రత్యర్థి ఎఎస్‌పి వెంకటేశ్వరరావుపై 32 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా ఎన్నికైన నల్లా రాముని పలువురు న్యాయవాద గుమాస్తాలు, న్యాయవాదులు తదితరులు అభినందించారు.

సామాజిక న్యాయం.. సీఎం జగన్‌తోనే సాధ్యం

- కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమం
- ఏలూరు నగరంలో 79వ రోజు గడపగడపకూ
- 28వ డివిజన్‌లో పాదయాత్రగా ఇంటింటికీ
- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని జనంతో మమేకం



ఏలూరు టైటస్‌నగర్‌లో గడపగడపకూ కార్యక్రమంలో మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: సమాజంలో ఆర్థిక, రాజకీయ, అసమానతలను రూపుమాపుతూ సామాజిక న్యాయం అంటే ఇలా ఉండాలంటూ చేసి చూపిస్తోన్న ఏకైక నాయకుడు... దేశానికే స్ఫూర్తిదాయక పరిపాలన చేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని అన్నారు. ఏలూరు నగరంలోని 28వ డివిజన్ టైటస్ నగర్‌లో సోమవారం సాయంత్రం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. 29వ డివిజన్ కార్పొరేటర్ ఉచ్చుల సుజిత, వైఎస్సార్‌సీపీ నాయకులు సన్నీ చైతన్య, డివిజన్ ఇన్‌చార్జులు కొల్లిపాక సురేష్, డాక్టర్ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి ఆత్మీయ స్వాగతం పలికారు. 79వ రోజు గడపగడపకూ కార్యక్రమంలో ఆళ్ల నాని పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో ఆరా తీశారు. అర్హులైన ప్రతీ పేదవానికీ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందనీ, ఏదైనా సాంకేతిక లోపంతో పథకం అందకపోతే లోపాలను సవరించి అర్హులకు పథకం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా పలు సమస్యల పరిష్కారానికి అధికారులకు వెంటనే ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ ... దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సమతుల్యత పాటిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు, అగ్రవర్ణ పేదలకు సంక్షేమ ఫథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఇక బీసీల్లోని అనేక కులాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సమకాలీన రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత పాటిస్తూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రతీ అంశాన్నీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ మంచెం మైబాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, యర్రంశెట్టి సుమన్, తుమరాడ స్రవంతి, డింపుల్ జాబ్, కలవకొల్లు సాంబ, సుంకర చంద్రశేఖర్, పోతర్లంక లక్ష్మణ్, అద్దంకి హరిబాబు, బత్తిన విజయకుమార్, లీగల్‌సెల్ నాయకులు ప్రత్తిపాటి తంబి, దొంగ రామాంజనేయులు, ఆచంట వెంకటేశ్వరరావు, బీసీ సెల్ నాయకులు పారిపిరెడ్డి నాగేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్లు మేతర సురేష్, యుగంధర్, పార్టీ నాయకులు పొలిమేర హరికృష్ణ, మోటమర్రి సదానందం, అర్జి నాగేశ్వరరావు, బందారు కిరణ్, జిజ్జువరపు రమేష్, ధనుంజయ్, తోటకూర కిషోర్, బాలత్రిపుర సుందరి, తిరుపతిరావు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, పీవో కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

పోటీ ప్రపంచంలో ముందుండాలంటే అన్ని రంగాల్లో రాణించాలి



వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అంజేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ముందుండాలంటే అన్ని రంగాల్లో ప్రవేశం కలిగి ఆయా రంగాల్లో విశేషంగా రాణించాలని స్థానిక రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల ఎండీ కే. సాయి రోహిత్ పిలుపునిచ్చారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి కళాశాల అంతర్గత క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయి రోహిత్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో రాణించాలంటే విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృడంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి ఏటా చదవుతో పాటు క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులను ఆయా రంగాల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో తమ కళాశాల విద్యార్థుల్లో ఐదుగురు విద్యార్థులు అంతర్ యూనివర్శిటీ స్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ చూపారన్నారు. ఆయా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్రికెట్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, ఖోఖో, వాలీబాల్ , విద్యార్థినిలకు నిర్వహించిన త్రోబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల విజేతలకు వివిధ స్పోర్ట్ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు కే. మధుబాబు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి



ప్రమాద స్థలంలో మృతదేహం అనుమానాస్పదంగా ఉందని ఫొటోలు చూపుతున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దెందూలూరు మండలం కొక్కిరాయి లంక గ్రామానికి చెందిన ఉచ్చుల విజయ భాస్కర్ మృతి విషయంలో అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులకు పూర్తి న్యాయం చేయాలని మానవ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ళ మురళీ కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక లేడీస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొక్కిరాయి లంక గ్రామానికి చెందిన ఉచ్చుల మహంకాళి, రూతమ్మ దంపతుల కుమారుడు విజయ భాస్కర్‌ను గత ఫిబ్రవరి 28వ తేదీన అతని స్నేహితులు సాయి, వాసు, శ్రీకాంత్ పుట్టిన రోజు పార్టీ ఉందని చెప్పి ఇంటి వద్ద నుంచి తీసుకు వెళ్ళారని, ఆ రోజు అర్థరాత్రి అయినా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఆ దంపతులు ఆందోళన చెందారన్నారు. అయితే తెల్లవారు జామున తమ కుమారుడు మొండికోడు వంతెన వద్ద శవంగా కనిపించాడని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. దీనిపై పోలీసులు రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసును తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ నెల 28వ తేదీన మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించడానికి రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ విచ్చేస్తున్నందున ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	66
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	08-10
బెండకాయలు	34	కంద	46
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	34
కాకర కాయలు	34-38	కీరా దోస	30
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	54	అల్లం	108
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	34	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	28-36	బఠాణి	60
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	15-20	చిలకదదుంప	28

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: సోమవారం ఏలూరు మండలం తిమ్మారావుగూడెంలో సీతారామలక్ష్మణ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట జరిగింది. ఈ కార్యక్రమానికి దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఉదయం 7 గంటలకు వేద పండితులు నూతనంగా నిర్మించిన రామాలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. మంత్రోచ్చరణల మధ్య అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. విగ్రహాల దాత ఎమ్మెల్యేతో పాటు సర్పంచ్ గుడిపూడి రఘు, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు,లు సీతారాములను దర్శించుకున్నారు.

ఆధ్యాత్మిక ప్రశాంతతకు ప్రభుత్వం కృషి



దేవతామూర్తుల విగ్రహాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ఆధ్యాత్మిక ప్రశాంతతకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని తెలిపారు. సోమవారం స్థానిక రామచంద్రరావు పేట వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ దేవతామూర్తుల విగ్రహాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నగరంలో ప్రజలు దైవ చింతనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని, నగరంలోని అనేక దేవాలయాల్లో నిర్వహించే ఉత్సవాల్లో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొని పూజాధికాలు నిర్వహిస్తూ నగరంలో శాంతి స్థాపనకు విశేష కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీ రామానుజాచార్యులు, శ్రీ దాసాంజనేయ స్వామి, జయ విజయులు, అన్నమాచార్యులు, గరుత్మంతుని విగ్రహాలను ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, కార్పొరేటర్ కత్తిరి రామ్మోహనరావు, వెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు కూరాళ్ళ రమాదేవి, కొండల అరుణ కుమారి, అట్టాడ రామకృష్ణ, తిప్పాని మణి, చోడే శివరామకృష్ణ పాల్గొన్నారు.